
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 30 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.20 (122.0338)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.66 (2.70)	78.39	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.48 (0.39)	50	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.235



ఉమ్మడి జిల్లాపై పట్టుబిగించిన కాంగ్రెస్

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయాలు
- సహకార సంస్థలపై జెండా పాతిన నేతలు
- పంచాయతీల్లో బీఆర్‌ఎస్‌కు అవకాశం లేకుండా ప్రత్యేకాధికారుల పాలన
- జిల్లా, మండల పరిషత్‌లలో 4తో ముగియనున్న పాలకవర్గాల గడువు

నల్లగొండ,జూన్ 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాపై కాంగ్రెస్ పట్టుబిగిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాలకు 11గెలుచుకోగా, లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్లమెంటు స్థానాలను హస్తగతం చేసుకుంది. అదే ఊపులో స్థానిక సంస్థలను, సహకార సంస్థలను చేతిలో ఉంచుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. చట్టసభల తర్వాత అధిక ప్రాధాన్యం ఉన్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి బీఆర్‌ఎస్ నేతను అవిశ్వాసంతో గద్దె దించగా, తమ పార్టీ నేతను రెండు రోజుల్లో చైర్మన్‌గా ఎన్నికునేందుకు కాంగ్రెస్ నేతలు వ్యూహం పన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పదవిని ఇటీవలే కాంగ్రెస్ నేత దక్కించుకొనేలా చక్రం తిప్పారు. దీంతో కీలకమైన రెండు సహకార పదవులూ కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. మరో ఏడు నెలల సమయం ఉన్న మునిసిపాలిటీలను 80శాతం దక్కించుకుంది. మిగిలిన స్థానిక సంస్థలు తమ ఆధీనంలో ఉండేలా పార్టీ నేతలు కార్యాచరణ అమలుచేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఉమ్మడి జిల్లాలో విపక్షాలకు ప్రజాప్రతినిధులే లేని పరిస్థితిని సృష్టించి, కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదనే సంకేతాలు ఇస్తున్నారు.

మునిసిపాలిటీలు ఒక్కొటిగా హస్తగతం చేసుకుంటూ..

స్థానిక సంస్థల్లో కీలకమైన మునిసిపాలిటీలన్నింటినీ హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పన్నిన వ్యూహం ఫలించింది.ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సమయం నాటికి 19 మునిసిపాలిటీల్లో ఒకే ఒకటి కాంగ్రెస్ చేతిలో ఉండగా, అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నింటిలో అవిశ్వాస తీర్మానాలు, చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరడం వంటి ఘటనలతో ప్రస్తుతం 15మునిసిపాలిటీలు ఆ పార్టీ ఖాతాలోకి వచ్చాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు కేవలం సూర్యాపేట, చండూరు, నకిరేకల్, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి మునిసిపాలిటీలు మాత్రమే మిగిలాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి మునిసిపల్ పాలకవర్గాల పదవీ కాలం పూర్తికానుండగా, వాటిపై కాంగ్రెస్ నేతలు ప్రత్యేక దృష్టిసారించి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

4తో ముగియనున్న జడ్పీటీసీలు, ఎంపీపీల పదవీ కాలం

ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు చెందిన నేతల ఆధీనంలోనే ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం జూలై 4తో ముగియనుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు జడ్పీ చైర్మన్ స్థానాలకు బీఆర్‌ఎస్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఉమ్మడి జిల్లాలోని 71 మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లోనూ 80శాతం వరకు బీఆర్‌ఎస్ నేతలే ఉన్నారు. వారంతా జూలై 4తో పదవులు కోల్పోనున్నారు. 71 మంది జడ్పీటీసీ సభ్యులు, 762 మంది ఎంపీటీసీ సభ్యులు కూడా అదే రోజు పదవీకాలం ముగియనుంది. వీరిలో 70 శాతం వరకు బీఆర్‌ఎస్ నేతలే ఉండడంతో బీఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులే లేని పరిస్థితి ఎదురవనుంది. మరోవైపున ఈ ఏడాది ఫిబ్రవరి 2న గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం సర్పంచ్‌లకు పర్సన్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా, ప్రత్యేకాధికారుల పాలనకు తెరతీశారు. తద్వారా పంచాయతీల్లో పాలనా వ్యవహారాలపై అధికారులు, ఎమ్మెల్యేలకు అజమాయిషీ దక్కింది. మొత్తంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో విజయాలు సాధించి, సహకార సంస్థల్లో పావులు కదిపి తమ ఖాతాల్లో వేసుకున్న కాంగ్రెస్ నేతలు, మునిసిపాలిటీల్లోనూ పార్టీ జెండా పాతారు. పంచాయతీల్లో ఇప్పటికే ప్రత్యేకాధికారుల ద్వారా బీఆర్‌ఎస్‌కు చెక్‌పెట్టగా, జిల్లా, మండల పరిషత్‌లలోనూ ప్రత్యేక అధికారుల పాలనకు రంగం సిద్ధమైంది.

డీసీసీబీ, డీసీఎంఎస్‌పై కాంగ్రెస్ జెండా

ఎంపీ, ఎమ్మెల్యే పదవుల తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ అధ్యక్ష పదవి నుంచి బీఆర్‌ఎస్ నేతను దింపేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకే ఒక్క డైరెక్టర్ ఉన్న కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల తర్వాత బలం 15 డైరెక్టర్లకు పెరగడంతో వారి మద్దతుతో చైర్మన్ మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గి గద్దెదింపారు. జూలై 1న జరిగే ఎన్నికతో డీసీసీబీ హస్తగతమవడం దాదాపు ఖాయమైంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ ఆ పార్టీని విభేదించిన తర్వాత ఆయన చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న సొసైటీ పాలకవర్గ సమావేశాన్ని నిర్ణీత గడువులోగా నిర్వహించని కారణంగా చైర్మన్ పదవి, అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కోల్పోయారు. ఎన్నికలకు ముందువరకు వైస్ చైర్మన్‌గా ఉన్న దుర్గంపూడి నారాయణరెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. తాజాగా, పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌కు చెందిన కేతేపల్లి సింగిల్‌విండో చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డిని తొలుత కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకొని, ఆతర్వాత చైర్మన్‌గా ఎన్నుకోవడం ద్వారా డీసీఎంఎస్‌ను తమ ఖాతాలోకి తెచ్చుకున్నారు.



- జాతీయ రహదారులపై ప్రతీ రోజు కేసుల నమోదు,జరిమానా
- ఆరు నెలల్లో 11,610 కేసులు, రూ.1.20కోట్ల జరిమానా
- ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

వాహనాల వేగానికి స్పీడ్ గన్స్‌తో కళ్లెం

నల్లగొండ క్రైం, జూన్ 29: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తోంది.జాతీయ, రాష్ట్ర రహదారులపై నిర్ణీత వేగానికి మించివెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా జాతీయ రహదారులపై ప్రతి రోజూ నిఘా ఉంచుతూ అధిక వేగంతో వెళ్లే వాహనాలపై కేసు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నల్లగొండ జిల్లాలో మూడు స్పీడ్ గన్ కెమెరాలు ఏర్పాటు చేసి ఆరునెలల వ్యవధిలో జిల్లాలో 11,610 కేసులు నమోదుచేసి జరిమానా విధించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిత్యం ప్రమాదాలు జరిగే 58 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. గత ఆరు నెలల్లో జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా, అధిక వేగంతో వెళ్లే వాహనాలను స్పీడ్ గన్స్ ద్వారా గుర్తించి రూ.1,20,16,350 జరిమానా విధించారు.

58 బ్లాక్ స్పాట్ల గుర్తింపు

తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను నల్లగొండ జిల్లా పోలీస్‌శాఖ గుర్తించింది. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ వింగ్ ద్వారా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 58 బ్లాక్ స్పాట్లను పోలీస్‌శాఖ గుర్తించింది. ఆ ప్రాంతాలలో వాహనదారుల కోసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మలుపుల వద్ద చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. గుండ్రాంపల్లి నుంచి ఉప్పలపహాడ్ వరకు 63కి.మీ పరిధిలో ఎన్‌హెచ్-65పై 17బ్లాక్ స్పాట్లు, ఎన్‌హెచ్-167పై డిండి పీఎస్ పరిధిలో యరగండ్లపల్లి నుంచి చింతపల్లి వరకు 106 కి.మీల పరిధిలో తొమ్మిది బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. మిగతా 32 బ్లాక్ స్పాట్లను రాష్ట్ర రహదారులపై గుర్తించారు. ఎన్‌హెచ్-65పై గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి, చిట్యాల, వట్టిమర్తి, నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఏపీ లింగోటం, ముత్యాలమ్మగూడెం, కట్టంగూర్ ఫ్లైఓవర్ (నల్లగొండ ఎక్స్ రోడ్డు), అయిటిపాముల (చెరువు అన్నారం క్రాస్ రోడ్డు), నకిరేకల్ ఎంట్రెన్స్, చీమలగడ్డ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఇనుపాముల జంక్షన్, కొర్లపహాడ్, కేతేపల్లి ఎస్సీ కాలనీ, చీకటిగూడెం స్టేజీ, ఉప్పలపహాడ్ వద్ద బ్లాక్ స్పాట్లను గుర్తించారు.

అదే విధంగా ఎన్‌హెచ్-167పై కొండభీమనపల్లి,దేవరకొండ మీనాక్షి హోటల్ (బస్టాండ్), అంగడిపేట ఎక్స్‌రోడ్డు, చిలకమర్రి, అక్కంపల్లి, పెద్దవూర వైజంక్షన్, అనుముల ఈశ్వర్‌నగర్, ఇబ్రహీంపేట స్టేజీ, నిడమనూరు (పీఎస్) వద్ద బ్లాక్ స్పాట్లను గుర్తించారు. అదే విధంగా రాష్ట్ర రహదారులపై నల్లగొండ రూరల్ చర్లపల్లి, ఆర్జాలబావి, పానగల్ ఎక్స్ రోడ్డు, తిప్పర్తి పీఎస్ పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి, తిప్పర్తి, బుగ్గబాయిగూడెం, వేములపల్లి, శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డు, అన్నపురెడ్డిగూడెం, నిడమనూరు ఎక్స్‌రోడ్డు, గూడూరు, కొత్తగూడెం, కొండ్రపోల్, బొత్తలపాలెం, దామరచర్ల ఎక్స్‌రోడ్డు, మాల్ వీటీనగర్, చింతపాలెం పీఎస్ పరిధిలోని పోలేపల్లి రామ్‌నగర్, కుర్మేడు గేట్, చింతపల్లి పీఎస్, నసర్లపల్లి, నల్లగొండ పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్దబ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాలు, అధిక వేగ నియంత్రణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. హైవేలు, రద్దీగా ఉండే రాష్ట్ర రహదారులపై కూడా స్పీడ్ గన్స్ ద్వారా వాహనాల వేగాన్ని బట్టి కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తున్నాం. వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనాలు నిర్దేశించిన వేగంతోనే వెళ్లాలి. అధిక వేగంతో వెళ్లి ప్రమాదాలు జరిగితే కుంటుబాలు ఇబ్బందులకు గురవుతాయని అంతా ఆలోచించాలి. జిల్లాలో మూడు స్పీడ్ గన్స్ ద్వారా జాతీయ, రాష్ట్ర రహదారులపై నిఘా ఉంచాం. కెమెరాలే వేగాన్ని గుర్తించి రికార్డు చేసే టెక్నాలజీ ఉండడంతో ఆ వేగాన్ని బట్టి వాహనాలకు జరిమానా ఆన్‌లైన్‌లో వస్తుంది. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాల నివారణకు 58 బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు స్పీడ్ గన్స్ ద్వారా 11,610 కేసులు నమోదు చేసి వాహనాల వేగాన్ని బట్టి రూ.1,20,16,350 జరిమానా విధించాం.

- శరత్‌చంద్ర పవార్, నల్లగొండ జిల్లా ఎస్పీ

మూడు స్పీడ్ గన్స్ ఏర్పాటు

అధిక వేగంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన నల్లగొండ జిల్లా పోలీస్‌శాఖ వాహనాల వేగ నియంత్రణకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయంతో మూడు స్పీడ్ గన్స్‌ను ఏర్పాటు చేశారు. స్పీడ్ గన్ కెమెరాలను కారుకు బిగించి దూరం నుంచి వచ్చే వాహనాల వేగాన్ని గుర్తించేలా ఏర్పాటుచేశారు. స్పీడ్ గన్స్ కెమెరాల ద్వారా అధిక వేగంతో వచ్చే వాహనాలను పసిగట్టి ఆ వేగాన్ని సీసీ కెమెరాలో రికార్డు చేయడంతో వేగాన్ని బట్టి జరిమానా విధిస్తున్నారు. జాతీయ రహదారిపై అధిక వేగంతో వచ్చే వాహనాలను తనిఖీ చేసే క్రమంలో పోలీస్ సిబ్బంది పలు సందర్భాలలో గాయపడటంతోపాటు పాటు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. వీటిని నివారించడం, అధిక వేగంతో వెళ్లే వాహనాలకు కళ్లెం వేసేందుకు టెక్నాలజీని వినియోగించుకుని స్పీడ్ గన్స్ ద్వారా జరిమానా విధిస్తున్నారు. దీంతో సిబ్బంది వినియోగం కూడా తగ్గింది. ఎక్కువగా వీటిని జాతీయ, రాష్ట్ర రహదారులపై వినియోగిస్తున్నారు.



రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



గుండ్రాంపల్లిలో మాట్లాడుతున్న జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్‌కుమార్

మిర్యాలగూడ రూరల్, జూన్ 29: ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తడమక్ల, ఆలగడప, మిర్యాలగూడ పీఏసీఎస్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం నిజమైన సాగుదారులకు అందించేందుకు ప్రభుత్వం రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. 43 పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నాగమణి, సహకారశాఖ రిజిస్ట్రార్ రాంబాబు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి, ఆలగడప, తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్లు వెలిశెట్టి రామకృష్ణ, పాదూరి సంజీవర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, ఏవో సరిత, ఏఈవో రమేష్, చైతన్య, నర్సయ్య, రూహిద్, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: రైతుల అభిప్రాయం మేరకు రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి, వెలిమినేడు గ్రామాల్లోని పీఏసీఎస్‌లలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సలహాలు, సూచనలతో పాటు వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, గుండ్రాంపల్లి, వెలిమినేడు వైస్‌చైర్మన్లు ఆవుల నాగరాజుయాదవ్, బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్లు కూరాకుల అంజయ్య, గడకారి చంద్రయ్య, యాకారి మారయ్య, పిశాటి భీష్మారెడ్డి, గడ్డం సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీసీఎల్‌ఏ ఇన్‌చార్జి నవీన్ మిట్టల్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నల్లగొండ టౌన్, జూన్ 29: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీసీఎల్‌ఏ ఇన్‌చార్జి నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వీలైనంత తొందరగా పెండింగ్ లేకుండా చూసుకోవాలని, అదే తరుణంలో తప్పులు చేయకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కస్తామని, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేకటీంలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మండలాలు, గ్రామాలవారీగా ధరణి సమస్యలపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నామని, త్వరలోనే జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే వారాన్ని ధరణివారంగా భావించి ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ అధికారి మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ: వచ్చే నెల 8వ తేదీన సోమవారం జిల్లాస్థాయిలో యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జూలై 1న సోమవారం మాత్రం మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణిలోనే ఫిర్యాదులు సమర్పించాలన్నారు. ప్రజా సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావాలనే ఉద్దేశ్యంతో గత సోమవారం మొదటిసారిగా మండలస్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్టం చేసేందుకు ఈవారం సైతం మండల స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 8న జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో విద్య, వైద్యం, అత్యవసర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ధరణికి సంబంధించిన ఫిర్యాదులు మండల స్థాయిలో సమర్పించాలని సూచించారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే వాహనాలపై కేసులు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూన్ 29: జిల్లా వ్యాప్తంగా నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై చీటింగ్ కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేర నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారం రోజుల్లో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 1,769 వాహనాలను పట్టుకున్నట్టు తెలిపారు. జిల్లాలో నేరాలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే నేరస్థులు నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను వినియోగిస్తుండటంతో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగేవారిపై, నెంబర్ ప్లేట్లు ట్యాంపర్ చేసిన వారిపై చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలను ఎస్పీ తన కార్యాలయంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ షబ్బీర్, ఆర్ఐలు సూరప్పనాయుడు, సంతోష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి



విలేకరులతోమాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 29: సింగరేణి ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది కుటుంబాలకు ఆధారంగా మారిన సింగరేణిని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి యత్నిస్తోందన్నారు. ప్రైవేటీకరణతో వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే కేంద్రం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు వెలువరిస్తున్న అభిప్రాయాలను వారు సేకరించి కేంద్రానికి పంపాలన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టిన ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే సింగరేణి బొగ్గును పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు ప్రైవేటీకరణ పేరుతో యత్నిస్తోందన్నారు. ఏకపక్షంగా ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం అన్ని పార్టీల నేతలతో కలిసి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేసేంతవరకు ఒత్తిడి తేవాలని అన్నారు. సమావేశంలో నాయకులు నారీ ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, పగిడోజు రాంమూర్తి, చిర్రమల్ల భిక్షం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● వైభవంగా నిత్యకల్యాణోత్సవం, సుదర్శన హోమం ● చూడముచ్చటగా శ్రీకృష్ణలీలలు నాటక ప్రదర్శన




నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, శ్రీకృష్ణలీలలు నాటకంలో కళాకారుల ప్రదర్శన

భువనగిరి అర్బన్, జూన్ 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించారు. ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించిన అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు సాయంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు, వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయాల్లో సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్ర హవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,38,693 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో స్వయంభువులకు నిత్యకైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి.

ఆకట్టుకున్న శ్రీకృష్ణలీలలు నాటక ప్రదర్శన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం అలరించాయి. కొండపైన ఆలయ ఉత్తర మాఢవీధిలో శ్రీ వినాయక నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలల నాటకం ప్రదర్శించారు. శ్రీకృష్ణుడి లీలలు, బలరాముడు, దేవకి, వసుదేవుడు, యశోదదేవి, నారదుడు, విష్ణుమూర్తి పాత్రల్లో కళాకారులు తమ నటనతో ఆకట్టుకున్నారు. కేంద్రీయ సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహిత ఆర్.వేణుగోపాల్‌రావు దర్శకత్వంలో నాటకం ప్రదర్శించారు.

రిటైనింగ్ వాల్ లైట్ల తొలగింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన విషయం తెలిసిందే. అలాగే ఆలయం చుట్టు రిటైనింగ్ వాల్‌ను నిర్మించే క్రమంలో పిల్లర్లను ఏర్పాటు చేశారు. ఆలయం తూర్పు దిక్కులో గోల్డెన్ క్యూలైన్ ఉండగా ఉత్తరం, దక్షిణం, పశ్చిమ దిక్కులో రిటైనింగ్ వాల్‌తో పాటు నిర్మించిన ప్రతి పిల్లరుకు సుమారు 75 లైట్లు బిగించారు. కాగా, వాటిలో కొన్నింటిని కోతులు ధ్వంసం చేయగా మరమ్మత్తులు చేసేందుకు శ్రీఆంజనేయస్వామి ఆలయం వెనుక ఉన్న స్టోర్ రూంకు సిబ్బంది తరలించారు. వాటికి మరమ్మత్తులు చేసి తిరిగి త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ ఎలక్ట్రికల్ ఈఈ రామరావు తెలిపారు.

మా 'సంక్షేమ' మాస్టరు మీరే

● కన్నతండ్రిలా బాగోగులు చూసుకున్నారని విద్యార్థుల భావోద్వేగం
● ఉద్యోగ విరమణ పొందిన హాస్టల్ వార్డెన్‌కు ఘనంగా వీడ్కోలు
● మేళతాళాలు, బాజాభజంత్రీలతో సాగనంపిన గ్రామస్థులు, విద్యార్థులు



లక్ష్మారెడ్డికు వీడ్కోలు పలుకుతున్న గ్రామస్థులు, విద్యార్థులు

తిరుమలగిరి (సాగర్), జూన్ 29: 'మాతో ఉంటూ కన్నతండ్రిలా మా బాగోగులు చూసుకున్నారు.. మా విద్యా ఉన్నతికి కృషి చేసిన వార్డెన్ సార్ హాస్టల్ వీడి వెళ్తుండడం బాధగా ఉంది.' ఇదీ నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థుల భావోద్వేగం. తమ సంక్షేమంతోపాటు బాగోగులు చూసుకున్న ఆ మాస్టర్(వార్డెన్) ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు మేళతాళాలతో ఊరేగింపుగా వీడ్కోలు పలికారు. తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రానికి చెందిన ఎస్టీ హాస్టల్ వార్డెన్, జిల్లా ఇన్‌చార్జి ఏటీడబ్ల్యూవోగా పనిచేస్తున్న కడారు లక్ష్మారెడ్డికి విద్యార్థులు, ఉద్యోగులతోపాటు గ్రామస్థులంతా కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎనిమిదేళ్లుగా స్థానిక ఎస్టీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న లక్ష్మారెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక హాస్టల్‌లో ఆయన్ను విద్యార్థులు, ఉద్యోగులతోపాటు గ్రామస్థులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక గ్రామస్థులతోపాటు విద్యార్థులు ఆయనను వాహనంపై గ్రామంలోని వీధుల గుండా మేళతాళాలతో ఊరేగిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్టీ కార్పొరేషన్ ఈడీ రాజ్‌కుమార్‌తోపాటు సహచర ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామస్థులు సైతం వీడ్కోలు కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనడం ఆయన చేసిన సేవలకు దక్కిన గుర్తింపు అని అన్నారు. నిరంతరం విద్యార్థులతో గడుపుతూ వారి బాగోగులు, సంక్షేమాన్ని పట్టించుకోవడం వల్లే లక్ష్మారెడ్డికి ఇంతటి ఘనమైన గుర్తింపు లభించిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై ప్రేమను చాటుకున్న పూర్వవిద్యార్థులు

● కిలోమీటరు మేర ఉపాధ్యాయుడి దంపతుల ఊరేగింపు
● వారు ఉన్న వాహనాన్ని తాళ్లతో లాగిన విద్యార్థులు



తాళ్లతో వాహనాన్ని లాగుతున్న విద్యార్థులు

నూతనకల్, జూన్ 29: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) తూము హన్మంతరావుకు పూర్వ విద్యార్థులు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. హన్మంతరావు దంపతులను పాఠశాల నుంచి కార్యక్రమం నిర్వహించే వేదిక వద్దకు సుమారు కిలోమీటరు మేర పూర్వవిద్యార్థులు వాహనంలో పూలుచల్లుతూ, వ్యాన్‌కు తాళ్లు కట్టి గ్రామంలో లాగుతూ వెళ్లారు. పూర్వ విద్యార్థుల్లో యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు కొల్పుల అమరేందర్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ నాగమల్లు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఉన్నారు. 39 సంవత్సరాల సర్వీసులో హన్మంతురావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి, భువనగిరి, నూతనకల్ మండలాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన శిష్యరికంలో ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సుమారు 600 మంది కలిసి నూతనకల్‌లో శనివారం హన్మంతురావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం పనిచేస్తున్న నూతనకల్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలోని ఐఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వరకు సుమారు కిలోమీటరు దూరం పూలతో అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఈ సందర్భంగా వాహనానికి తాళ్లు కట్టి వేదిక వద్దకు లాగుతూ తీసుకెళ్లారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, జూన్ 29: అమ్మా నన్ను క్షమించు నిన్ను చూసుకోకుండానే నాన్న వద్దకు వెళుతున్నాను. వ్యాపారం కోసం తీసుకున్న అప్పులు చెల్లించలేకపోతున్నాను. మీరెన్ని సార్లు వద్దని చెప్పినా వినకుండా రుణాలు తీసుకున్నాను. ఇప్పుడవి చెల్లించలేక మీకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే దూరమవుతున్నాను.. నా కుమారుడు నవీన్‌రెడ్డిని మంచిగా చూసుకోండి... బాగా చదివించి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకూ కుటుంబ సభ్యులందరూ సహాయం చేయండి.. అప్పులకు అన్నింటికి నేనే బాధ్యుడిని... నా కుటుంబసభ్యులకు ఎలాంటి సంబంధం లేదంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఖమ్మంలో జరిగింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన యరసాని శ్రీనివాసరెడ్డి (38) ప్రైవేట్ వ్యాపారం చేస్తుంటాడు. గతంలో ఖమ్మంలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ ఏదులాపురంలో నివాసం ఉన్నాడు. ఆ తర్వాత ప్రైవేటు వ్యాపారం చేసుకుంటూ కొంతకాలంగా మిర్యాలగూడలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. కొంతకాలం క్రితం ప్రైవేట్ యాప్‌లు, బ్యాంక్‌లు, క్రెడిట్ యాప్‌లలో వ్యాపారంకోసం లోన్లు తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో తీసుకున్న అప్పులు చెల్లించలేక ఇబ్బందులుపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మిర్యాలగూడలోని తన నివాసంలో మొబైల్ ఫోన్‌ను పెట్టి ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చి నగరంలోని ఓలాడ్జ్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో లాడ్జి సిబ్బంది తలుపుకొట్టగా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్‌ఐ రఫి సంఘటన స్థలం వద్దకు వెళ్లి గది తలుపును పగలగొట్టి చూడగా శ్రీనివాసరెడ్డి ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. తర్వాత గదిని పరిశీలించగా అప్పులు కట్టలేక సూసైడ్ చేసుకుంటున్నా అని లెటర్ రాసి ఉంది.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరపున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడి విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బొకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా- వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్లు వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా.." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు.



అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.

మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?


నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!




సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు వొప్పుకోలేదు. ఇదో కెరీర్ అని వొప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్'(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.




> నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్గా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్ఫయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'అజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది... తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

'కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి'

దేవరకొండ, జూన్ 29: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60ప్రకారం రూ.15,600 కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఆస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ ఆసుపత్రి ఎదుట శనివారం ధర్నా చేశారు. జీవో 60ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కమిషనర్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, రామేశ్వరమ్మ, వనజ, భద్రమ్మ, రాణి పాల్గొన్నారు.

చెక్కులు డ్రా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ, జూన్ 29: ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి చెక్కులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఏర్పాటు చేసిన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ భూనిర్వాసితుల పేర కొందరు అక్రమంగా డబ్బులు కాజేశారని ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయంలో చెక్‌బుక్ దొంగిలించి సంతకాన్ని ఫోర్జరీ చేసి మూడు చెక్కుల ద్వారా లక్షలాది రూపాయలు బ్యాంకు ద్వారా డ్రా చేసుకున్నారన్నారు. దీని వెనుక కార్యాలయ అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఈ విషయంలో నామమాత్రం విచారణ కొనసాగిస్తున్నారన్నారు. అర్హులైన రైతులకు న్యాయం చేయకుండా దళారులకు సెక్షన్ అధికారులు సహకారిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోతుగంటి కాశి, వస్కుల సైదమ్మ, ధీరావత్ మోహన్ నాయక్, రామంజి, జ్యోతి, చంద్రకళ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వ్యాపారాన్ని అరికట్టాలి : కేవీపీఎస్

హాలియా, జూన్, 29: కేజీల లెక్కన విద్యను అమ్ముకుంటున్నారని, ప్రైవేటు విద్యా సంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. హాలియాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాణ్యమైన విద్య పేరిట ప్రైవేట్ పాఠశాలలు విచ్చల విడిగా దందా ప్రారంభించాయన్నారు. పేద మధ్యతరగతి పిల్లల తల్లితండ్రుల సంపాదన పాఠశాల ఫీజుకు సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ధైద శ్రీను, దొంతాల నాగార్జున, దొరేపల్లి మల్లయ్య, వెంకన్న, జీవన్, సతీష్ పాల్గొన్నారు.

రేపు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశం

నల్లగొండ టౌన్, జూన్ 29: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జూలై 1వ తేదీన జిల్లాకేంద్రంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న జయశంకర్ పార్కులో నిర్వహించనున్నట్లు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్ ముస్తఫా తెలిపారు. సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభిప్రాయాలు తెలుసుకొని భవిష్యత్తులో తీసుకొనే కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మలి దశ ఉద్యమకారులందరూ హాజరు కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రైతు భరోసా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు

నల్లగొండ, జూన్ 29: రైతు భరోసాను పారదర్శకంగా అమలు చేసేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు గొల్లగూడెం పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకొని రైతు భరోసాను అమలు చేయనుందన్నారు. జిల్లా సహకార కార్యాలయం డిప్యూటీ రిజిష్టర్ గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచనల మేరకు సొసైటీలల్లో సభ్యులైన రైతుల నుంచి అభిప్రాయాలు, సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, వైస్ చైర్మన్ తవిటి కృష్ణ, డైరెక్టర్లు రుద్రాక్షి వెంకన్న, దేప వెంకటరెడ్డి, హాషం రేణుక, అంజయ్య, ఎల్లయ్య, మందడి వెంకట్ రెడ్డి, సీఈవో అనంతరెడ్డి, అసిస్టెంట్ రిజిష్టర్‌లు శివకుమార్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పంటలు పండించే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. చిట్యాల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు సుంకరి మల్లేష్‌గౌడ్ అధ్యక్షతన శనివారం జరిగింది. రైతు భరోసాపై రైతులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఐటీ చెల్లించేవారైనా, రేషన్‌కార్డు లేకపోయినా రైతు భరోసా ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీవో కిరణ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్ని రకాల పంటలకు మద్దతు ధర ఇవ్వాలి'

చిట్యాల, జూన్ 29: అన్ని రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. చిట్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బ్యానర్లతో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. రైతు రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. ఈ నెల 30న చిట్యాలలో జరిగే నియోజకవర్గ స్థాయి సీపీఎం శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కోతిని తప్పించబోయి యువకుడికి గాయాలు

కేతేపల్లి, జూన్ 29: కోతిని తప్పించబోయి యువకుడు ప్రమాదం బారిన పడి గాయాలపాలైన ఘటన 65వ నెంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన నవీన్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వీకెండ్ కావడంతో శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై సత్తుపల్లికి బయల్దేరాడు. కేతేపల్లి స్థానిక నిమ్మలమ్మ చెరువు సమీపంలోకి రాగానే ఓ కోతి హైవేను దాటుతూ బైక్‌కు అడ్డు వచ్చింది. దీంతో అప్రమత్తమైన నవీన్ కోతికి బైక్ తగలకుండా ఉండేందుకు సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పిన బైక్ రోడ్డుపై పడింది. బైక్ నడుపుతున్న నవీన్ రోడ్డుపై పల్టీలు కొడుతూ దాదాపు 10అడుగుల దూరం వరకూ వెళ్లాడు. ఈ ప్రమాదంలో తలకు, ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోతుల వీరంగం.. పాఠశాల విద్యార్థులకు గాయాలు

కనగల్: మండలకేంద్రమైన కనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులపై కోతులు దాడికి దిగాయి. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులపై కోతులు మూకుమ్మడి దాడికి దిగగా, విద్యార్థులు భయాందోళనలో పరుగులు తీశారు. కోతుల దాడిలో ఏడో తరగతి విద్యార్థి దివ్య కాలుకు, ఆరో తరగతి విద్యార్థి శివరాం తలకు గాయాలయ్యాయి. అనంతరం ఉపాధ్యాయులు కోతులను పాఠశాల బయటికి వెళ్లగొట్టి విద్యార్థులను స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కాగా డీఈవో భిక్షపతి పాఠశాలను సందర్శించి కోతుల దాడి ఘటన వివరాలను హెచ్ఎం వెంకటరాంరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

బాధితుల గుర్తింపునకు రీసర్వే చేయాలి



మునుగోడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 29: ప్రాజెక్టుల కింద ముంపులో ఇళ్లు, భూములు కోల్పోయిన బాధితులందరినీ గుర్తించేందుకు రీ సర్వే నిర్వహించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మండలంలోని శివన్నగూడెం, కిష్టరాయినిపల్లి ప్రాజెక్ట్‌లతో పాటు చెరువులు, కుంటలపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో శనివారం క్యాంపు కార్యాలయంలో వేర్వేరుగా జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్ఆర్, భూ పరిహారంపై సూచనలు చేశారు. నిర్దేశించిన ప్రకారం భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ నష్టపరి హారం అందేలా చూడాలన్నారు. రీసర్వేలో ఆర్‌అండ్‌బీ అధికారులను సమన్వయం చేసి నష్టపోయిన ఆస్తుల విలువను లెక్కగట్టాలని సూచించారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా 18సంవత్సరాలు నిండిన యువకులకు కటాఫ్ డేట్ పెంచాలని సూచించారు. మునుగోడు నియోజకవర్గం నీటి పారుదల శాఖకు సంబంధించి ముగ్గురు కార్యనిర్వాహక ఇంజనీర్ల పరిధిలో విస్తరించి ఉందన్నారు. శేషలేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్‌ల పనులకు తిరిగి ప్రతిపాదన చేయాలని, బెండలమ్మ చెరువులకు కొత్తగా టెండర్లు పిలవాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ రాము లునా యక్, చండూరు, దేవరకొండ ఆర్డీవోలు సుబ్రమాణ్యం, శ్రీరాములు ఉన్నారు.

పనిచేసే కార్యకర్తలకే పదవులు

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకే పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ప్రజల శ్రేయస్సు కోసం కట్టుబడి ప్రణాళికతో పని చేస్తామన్నారు. నాయకులు పార్టీ బలోపేతం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. గ్రామాల్లో కొందరు నేతలు అధికార పార్టీ పేరుతో వివిధ పంచాయితీల్లో జోక్యం చేసుకుంటున్నారని, పైరవీలు చేస్తు న్నట్లు తన దృష్టికి వచ్చిందని ఏమాత్రం సహించబోనని ఆయన స్పష్టం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

మర్రిగూడ: మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి సాగునీటి ప్రాజెక్టులపై చండూరు, దేవరకొండ ఆర్డీవోలతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు ప్రాజెక్టుల కింద ముంపునకు గురవుతున్న గ్రామాల్లో ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ, భూపరిహార విషయాలపై అధికారులకు సూచనలు చేశారు. భూ సేకరణ, స్ట్రక్చర్ వ్యాల్యూను రీసర్వే చేయాలన్నారు. శివన్నగూడ ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం, చర్లగూడ, వెంకేపల్లి తండాలతో పాటు కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న లక్ష్మణాపురం, ఈదులగండి గ్రామాల్లో హౌస్ స్ట్రక్చర్ రీవాల్యుయేషన్ చేయాలన్నారు. ఈ హౌస్ స్ట్రక్చర్ రివాల్యుయేషన్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రివాల్యుయేషన్ చేయాలని సూచించారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన యువకుల వయస్సుకు సంబంధించి కటాఫ్ డేట్ పెంచాలని అధికారులకు సూచించారు.

నేతన్నల సమస్యలు పరిష్కరిస్తా

చండూరు: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో చండూరుకు చెందిన చేనేత కార్మికులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ కోడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించారు. త్రిఫ్ట్ ఫండ్‌కు సంబంధించిన పెండిం గ్ చెక్కులు వెంటనే విడుదలయ్యేలా, చేనేత మిత్ర ద్వారా నెలకు రూ.3వేలు కార్మికులకు అందేలా ఆర్థిక మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చేస్తానన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం తోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. మాజీ సీఎం వైఎస్ ప్రభుత్వ హయాంలోనే రూ.312 కోట్ల చేనేత రుణాలను మాఫీ చేయించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు తిరందాసు శ్రీనివాసులు, చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, కర్నాటి శ్రీనివాసులు, రాపోలు వెంకటేశం, రావిరాల శ్రీను, ఏలె శ్రీను, కృష్ణ, చంద్రశేఖర్, తిరందాసు ఆంజనేయులు, పాల్గొన్నారు.

అంగడిపేటలో నేడు లక్ష్మణ్‌రావు విగ్రహ ఆవిష్కరణ

దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి, జూన్ 29: పీఏపల్లి మండలం అంగడిపేటలో ఆదివారం జరిగే దేవరకొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దివంగత లక్ష్మణ్‌రావు విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగరావు, లక్ష్మణ్‌రావు కుమారుడు వెంకటమాధవరావు కోరారు. దేవరకొండలో విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలు శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. లక్ష్మణ్‌రావు ఘనపురం సర్పంచ్‌గా, దేవరకొండ మార్కెట్ చైర్మన్‌గా, పీఏపల్లి మండల అధ్యక్షుడిగా, విద్యుత్ బోర్డు సలహాదారుడిగా పని చేశారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌తో లక్ష్మణ్‌రావుకు సన్నిహిత సంబంధాలు ఉండే వని, జల సాధన ఉద్యమంలోనూ ఆయన కీలకపాత్ర పోషించా రన్నారు. కార్యక్రమంలో వేణుమాధవ్, తోటకూర రమేష్, రెడ్డిమళ్ల వినయ్ పాల్గొన్నారు.



దేవరకొండలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మా నీళ్లు మాకే కావాలని పోరాటం

కరువు కాటకాలతో విలవిల లాడుతున్న ఈ ప్రాంతంతో లక్ష్మణ్‌రావు జలసాధన ఉద్యమం చేపట్టారు. హైదరాబాద్ తాగునీరుకు కృష్ణాజలాల తరలింపునకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. 'మా నీళ్లు మాకే కావాలని, మా బీడు భూములు తడవకుండా మీ కాళ్ల కాడికి రానివ్వం' అంటూ ధర్నాలు నిర్వహించారు. పోలీస్ కాల్పుల దాకా పోరాటం సాగింది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో పాలన పరంగా మండలాలు ఏర్పాటు చేయడంతో పెద్దఅడిశర్లపల్లి మండలానికి 1987-1992 వరకు తొలి మండలాధ్యక్షుడిగా భారీ మెజారిటీతో గెలిచారు.

దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా



అనుమతులు లేకుండా చదును చేసిన ప్రభుత్వ భూమి

డిండి, జూన్ 29: డిండి మండలం నెమలిపూర్ గ్రామశివారులోని సాకి బండ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశాడు. 20రోజులుగా గుట్టను తొలగించి చదును చేస్తున్న రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. గ్రామశివారులోని సర్వే నెం.147లో 42.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 33.05 ఎకరాల భూమి కొందరి రైతుల పేరున రికార్డుల్లో నమోదై ఉంది. మరో 9.20గుంటల భూమిని మిగులు భూమిగా రికార్డులు చూపుతున్నాయి. మిగులు భూమిని గ్రామానికి చెందిన ఓవ్యక్తి యంత్రాలను ఉపయోగించి చదును చేస్తున్న పట్టించుకునేవారు లేరని గ్రామస్థులు తెలిపారు. సర్వే నెం.147లోని మిగులు భూమిలో డివిజన్ సర్వేయర్ సర్వే నిర్వహించి మిగులు భూమిగా తేల్చాడు. మిగులు భూమిని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మండపానికి కేటాయించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. అదేభూమి ఆక్రమణకు గురవుతుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దేవరకొండ ఆర్డీవో శ్రీరాములును వివరణ కోరగా రెవెన్యూ అధికారులను గ్రామానికి పంపించి విచారణ చేస్తామన్నారు.

డీఎస్ మృతికి ఎంపీ రఘువీర్‌రెడ్డి సంతాపం

నల్లగొండ, జూన్ 29: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీమంత్రి డి. శ్రీనివాస్ మృతి పట్ల నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీఎస్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు.

ఎమ్మెల్యే బాలునాయక్ సంతాపం

దేవరకొండ: పీసీసీ మాజీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ మృతిపట్ల దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సంతాపం ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్రమంత్రిగా పనిచేసి కాంగ్రెస్‌పార్టీలో శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. డీఎస్ మృతికి దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, జాల నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, నేరేడుగొమ్ము ఎంపీపీ బిక్కునాయక్, సిరాజ్‌ఖాన్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, పున్న వెంకటేష్, యూనుస్‌లు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

డీఎస్ సేవలు చిరస్మరణీయం

హాలియా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ధర్మపురి శ్రీనివాస్ చేసిన సేవలు చిరస్మరనీయమని మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో శనివారం హాలియా బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సంఘం నాయకులు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు గోపిశెట్టి నర్సింహ, కొత్త వెంకటేష్, నల్లగొండ సుధాకర్, ఆవుల జెన్నయ్య, కేసాని యాదయ్య, చాపల నరేందర్, కేసాని ఆంజనేయులు, ఆకుల కొండలు, బండి ఈశ్వరయ్య, దంతాల యాదయ్య, కేసాని వెంకటయ్య, చాపల వెంకన్న, గోపిశెట్టి మధు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్‌వో

మునుగోడు, జూన్ 29: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించినా శాఖ పరంగా చర్యలు ఉంటాయని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ జరిపారు. హాస్పిటల్‌లోని వివిధ గదులతో పాటు నిర్వహణ రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు, వైద్య సిబ్బంది పనితీరుపై పలువురిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. వంతుల వారిగా వస్తూ విధుల పట్ల అలసత్వం చూపితే ఇక ఉపేక్షించేది లేదని మందలించారు. డీఎంహెచ్‌వో వెంట మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద, డాక్టర్ మాధూరి, డాక్టర్ స్ఫూర్తి సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషిచేయాలి

చిట్యాలరూరల్, జూన్ 29: నూతనంగా ఎన్నికైన పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు కృషిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం ఏపూర్, ఆరెగూడెం గ్రామల్లో శనివారం నూతనంగా పాలసంఘం డైరెక్టర్లు, చైర్మన్లను ఎన్నుకున్నారు. ఏపూర్ పాలకవర్గ సభ్యులు నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పాలకవర్గం పాడిరైతుల అభ్యున్నతికి, సంఘం బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏపూర్, ఆరెగూడెం చైర్మన్లు గుమ్మి వెంగళ్‌రెడ్డి, మురాల రాధిక, సికిరిమెట్ల భిక్షం, అరూరి సునంద, అరూరి నాగమణి, సాపిడి రమణమ్మ పాలెం కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ సురిగి లింగస్వామి, గడకారి సైదులు, బండ మహేష్, యాదయ్య, పిశాటి మాధవరెడ్డి, జానయ్య, కిషోర్, యాదగిరి, నర్సింహ, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు: ఎమ్మెల్యే

దేవరకొండ, జూన్ 29: ఇందిరాక్రాంతి పథకం ద్వారా మహిళా స్వయం సహాయ సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వయం సహాయక సంఘం, మహిళా సంఘాలు, అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందిరాక్రాంతి పథం ద్వారా మహిళలు చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.

● పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నేతలు ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమాల ఆంజనేయులు, మురళికృష్ణ, కొర్ర రాంబాబు, నాగేందర్, పవన్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: విద్యుత్ కార్మికుల సంఘం ఐఎన్‌టీయూసీ 327 జెండాను శనివారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆవిష్కరించారు. కొండమల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఇనుగాల శ్రీధర్, ఎండీ. నిరంజన్‌అలీ, వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ముక్కమల వెంకటయ్య, యూనూస్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, మురళీ, జగన్‌నాయక్, లాలునాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: డిండి, ఎత్తిపోతల రిజర్వాయర్ల కింద భూములు, ఇళ్లు కోల్పోతున్న భూ నిర్వాసితులందరికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీరాములుతో కలిసి క్రిష్టాంపల్లి బాధితులతో మాట్లాడారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

మాడ్గులపల్లి, జూన్ 29: ప్రభుత్వ అనుమతులు లేకుండా పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శోభన్‌బాబు శనివారం అన్నారు. ఇసుకను తీసుకెళ్లేందుకు రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్లు పట్టుబడితే వదిలిపెట్టేది లేదని, కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు

నిడమనూరు, జూన్ 29: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలు అదుపులో ఉంటాయని హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్ అన్నారు. నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో కెమెరాల ఏర్పాటుపై స్థానిక వ్యాపారులకు శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. నేరాలు తగ్గడంతో పాటు సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను కూడా అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు దోహదం చేస్తుందని తెలిపారు. కెమెరాలతో నిఘా ఉంటే నిందితులను సకాలంలో గుర్తించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ గోపాల్‌రావు, ఏఎస్ఐ జోజి, ఓరుగంటి కృష్ణమూర్తి, చీదళ్ల శ్రీనివాస్, వసంతరావు, హనుమంతు, ముఖేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన బోళ్ళ వెంకటరెడ్డిని పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గార్లపాటి సుధీర్‌రెడ్డి, డైరెక్టర్‌లు పి.సుధాకర్‌రెడ్డి, ఎ.సంజీవరెడ్డి, చింతం వెంకటేశ్వర్లు, సీఈవో వడ్డె నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు బీరం జాన్‌రెడ్డి, మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కోట పుల్లయ్య, డి.నాగేశ్వరరావు, కె.సైదులు, భిక్షమయ్య, డి.సంపత్ ఉన్నారు.

నల్లగొండ క్రైం: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నర్సింహ మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో కలిశారు.

దేవరకొండ: ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ కోరారు. దేవరకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలునాయక్‌కు మంత్రి పదవిఇస్తే వెనుకబడిన ప్రాంత మైన దేవరకొండ అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరాచారి, అంకం చంద్రమౌళి, రాసమళ్ల నారయ్య, కృష్ణమాచారి, అజ్మత్‌ఉల్లా, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

చింతపల్లి: మండలకేంద్రంలో ఆధార్ కేంద్రాల సంఖ్యపెంచాలని మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రహీం కోరారు. వెంకటేశ్వరనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులు తమ ఆధార్‌లో తప్పు-ఒప్పులను సరిచేసుకోవడానికి మండలకేంద్రానికి వస్తే నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గర్భిణులు కుర్చోవడానికి బెంచీలు కూడా ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు.

నార్కట్‌పల్లి: మండలంలోని మాండ్ర-కక్కిరేణి సరిహద్దు గ్రామాల్లోని అనంత స్వర్ణగిరిపై గల పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 28 నుంచి జూలై 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవ

సంక్షిప్త సమాచారం..

వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం సుప్రభాత సేవ, బాలభోగం చేశారు. ధ్వజారోహణంపై గరుడముద్ద ఎగురవేశారు. యాజ్ఞికులు వంశీకృష్ణమాచార్యుల స్వీయ పర్యవేక్షణలో అర్చక స్వాములచే సామూహిక విష్ణు సహస్ర నామార్చన, హోమంలను వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాత ఉంద్ర భాగ్యమ్మాలింగారెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నెంబరు ప్లేటు లేని బండి నడిపిన వాహన చోదకులపై సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు నమోదు చేస్తామని నార్కట్‌పల్లి ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు. ఇటీవల కొందరు గుర్తు తెలియని దుండగులు నెంబర్ ప్లేటు లేని ద్విచక్రవాహనాలను వినియోగిస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్నారని ఇలాంటి సంఘటనల్లో ఆధారాలు లేకుండా తాము కేసుల విచారణకు ఇబ్బంది పడుతున్నామని చెప్పారు.

కనగల్: మండల పరిషత్‌సర్వసభ్య సమావేశం జూలై 2న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

శాలిగౌరారం: దళిత ఉద్యోగిపై ఆరోపణలు చేయడం అసమంజసమని వెంటనే ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ మండల కన్వీనర్ బట్ట శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రకులానికి చెందిన వ్యక్తి తనకు అనుకూలంగా పనులు చేయకపోతే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ నిందలు వేయడం పిరికి పంద చర్య అన్నారు. ఇక నుంచి దళిత ఉద్యోగుల పై చిన్న చూపు చూస్తే సహించేది లేదన్నారు. ఎస్ఐని అవమాన పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బట్ట నర్సింహా, బట్ట సైదులు, లక్ష్మీనారాయణ, సతీష్, రాజు, శేఖర్ పాల్గొన్నారు

మిర్యాలగూడ టౌన్: ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అన్నారు. ఇండియన్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన విద్యార్థిని ఎస్. అనన్యను అభినందించారు. మాథ్స్ ఒలింపియాడ్‌లో స్టేట్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమన్నారు. కే. గణేష్‌రెడ్డి, అక్షయ, సుఫియా, మహేందర్‌రెడ్డి, భార్గవసాయి, హరిప్రియ, జైత్ర, యశ్వంత్, ఉమేష్, భవానీ, ప్రణతి, మహేష్‌లు ఉత్తమ ర్యాంకులతో ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, కట్ట అనిత తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: డీసీసీబీ చైర్మన్‌గా బీసీని నియమించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. సామాజిక న్యాయం చేస్తామంటూ ప్రచారం చేసుకునే కాంగ్రెస్ పెద్దలు బీసీలకు చేసేందేమీ లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని పదవులు ఒకే సామాజిక వర్గానికి దక్కాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే డీసీసీబీ చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నేడు నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. పట్టణంలోని జేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో విశ్వబ్రాహ్మణ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: జూలై 3వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమేశ్‌చారి తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అడవిదేవులపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి. కరుణాకర్‌రావు అన్నారు.